క్లుప్తంగా

బంగారు ఆభరణాల దోపిడీ

కంబాలచెరువు: రాజమహేంద్రవరంలోని పలు ప్రాంతాల్లో నడిచి వెళ్తున్న మహిళ మెడల్లోంచి బంగారు ఆభరణాలు లాక్కునిపోయిన వరుస సంఘటనలు ఆదివారం చోటుచేసుకున్నాయి. క్వారీ ప్రాంతానికి చెందిన పి.వెంకటలక్ష్మి కోటిపల్లి బస్టాండ్ వద్దనున్న జోడుగుళ్ల వద్దకు వెళుతున్నారు. గుడి సమీపంలోకి వచ్చేసరికి వెనుక నుంచి ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి ఆమె మెడ నుంచి 10 గ్రాముల బంగారు గొలుసు లాక్కుని పారిపోయారు. దీనిపై రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సత్యసుజాత అనే మహిళ లాలాచెరువు సమీపంలోని గాంధీపురం – 4 లో నడిచి వెళుతుండగా గుర్తుతెలియని వ్యక్తులు వెనుక నుంచి వచ్చి ఐదు కాసుల బంగారు గొలుసు లాక్కుని పారిపోయారు. పి.లక్ష్మి అనే మహిళ లలితానగర్‌లో నడిచి వెళుతుండగా రెండున్నర కాసుల బంగారు గొలుసు గుర్తు తెలియని వ్యక్తులు లాక్కుని పారిపోయారు. ఈ రెండు ఘటనలపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి.

సీపీఎం నగర కార్యదర్శిగా రామకృష్ణ

ప్రకాశం నగర్ : సీపీఎం నగర నూతన కార్యదర్శిగా కర్రి రామకృష్ణ నియమితులయ్యారు. ఆదివారం సీపీఎం నగర మహాసభ స్థానిక తాడితోటలోని శ్రీరాములు కల్యాణ మండపంలో జరిగింది. ఈ మహసభలో జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అధ్యక్షతన 11 తీర్మానాలను ప్రవేశ పెట్టి ఏకగ్రీవంగా అమోదించారు. ఆనంతరం 13 మంది సభ్యులతో నూతన కమిటీ ఎన్నికైంది. వీరిలో నగర కార్యదర్శిగా కర్రి రామకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా బి.పవన్, పూర్ణిమ రాజు, జరీనా, సరోజ్, నగర కమిటీ సభ్యులుగా పి.మురళీ కృష్ణ, ఎస్.వెంకటేశ్వరావు ఎన్నికయ్యారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో విజయ కేతనం



పతకాలు సాధించిన డ్రీమ్స్ స్కూల్ విద్యార్థులు

ధవళేశ్వరం: రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ధవళేశ్వరం డ్రీమ్స్ స్కూల్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో ఆదివారం జరిగిన ఇంటర్ స్టేట్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్–2024లో డ్రీమ్స్ విద్యార్థులు పది బంగారు, ఎనిమిది రజత, రెండు కాంస్య పతకాలతో పాటు బెస్ట్ స్కూల్ పెర్ఫార్మెన్స్ అవార్డును కైవసం చేసుకున్నారు. కటా విభాగంలో రఘుపాత్రుని రోషిని శ్రీసాయి గౌరి, పుల్లెల లాస్యప్రియ, దంగేటి మధుసత్యశ్రీ, చింతా సందీప్ తేజ, పొత్తూరి సత్యమహేంద్రవర్మ, మజ్జి వివేక్‌నాయుడు, మోర్త సుజయ్ కమల్, గల్లా ఆనంద్‌రాజ్, పనస రేష్మనాయుడు, సమనసి ఆదిచర్చిత బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. ఉండపల్లి దేవిసరయు, పనస దివిజనాయుడు, టేకుమూడి శర్వాణి, కాట్రు విజయ్, కామిరెడ్డి లిఖిత, జోగ చరణ్‌తేజ, కాజులూటి దరహాస్, ఉర్రింకల మోహన్‌సాయి రజత పతకాలను సాధించారు. చితిరాల కార్తీక, కొల్లాటి నవదీప్ కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన కరాటే మాస్టర్ కె.జానకిరాముడును డ్రీమ్స్ విద్యాసంస్థల చైర్మన్ అంగర రమేష్ అభినందించారు.

దేవీచౌక్‌లో బ్రాంచి ప్రారంభం



లైఫ్ మెడికల్ స్టోర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ: ప్రజలకు అందుబాటులో అన్ని కంపెనీల మందులు హోల్‌సేల్‌గా, రిటైల్‌గా సర్జికల్స్‌తో పాటు బేబీకేర్ వంటి వస్తువులను లైఫ్ మెడికల్ స్టోర్ లిమిటెడ్ ఒకే చోట నగర ప్రజలకు అందించే ఏర్పాటు చేయడం ఆనందాయకమని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలో లైఫ్ మెడికల్ స్టోర్ ప్రయివేట్ లిమిటెడ్ మూడవ బ్రాంచిని ఎమ్మెల్యే ప్రారంభించారు. సర్జికల్ విభాగాన్ని డాక్టర్ భలభద్ర సురేష్‌కుమార్, బేబీకేర్ విభాగం తటవర్తి శ్రీనివాస్, క్యాష్ కౌంటర్‌ను డాక్టర్ గ్రంధి అరవిందం ప్రారంభించారని లైఫ్ మెడికల్ స్టోర్ లిమిటెడ్ యాజమాన్యం తెలిపింది.

వెండితెరకు నిర్లక్ష్యం చెదలు

- ఏడాది గడవకముందే నిలిపివేసిన సందేశాత్మక చిత్రాల ప్రదర్శన
- నెల రోజులుగా మూతపడ్డ ఓపెన్ ఎయిర్ థియేటర్
- పట్టించుకోని నగరపాలక సంస్థ అధికారులు



శ్రీ బ్రహ్మజ్యోస్యుల సుబ్రహ్మణ్య మైదానంలో నిలిచిపోయిన చిత్రాల ప్రదర్శన

రాజమహేంద్రవరం సిటీ: నగర ప్రజలకు సందేశాత్మక చిత్రాలను ప్రతీ రోజూ ప్రదర్శించే విధంగా ప్రతిష్టాత్మకమైన శ్రీ బ్రహ్మజ్యోస్యుల సుబ్రహ్మణ్య మైదానంలో మాజీ ఎంపీ భరత్‌రామ్ ప్రత్యేక శ్రద్ధతో ఏర్పాటు చేసిన ఓపెన్ ఎయిర్ థియేటర్ నెల రోజులుగా నిలిచిపోవడంతో సాహితీ అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చారిత్రక రాజమహేంద్రవరం నగరంలో సుబ్రహ్మణ్య మైదానంలో చారిత్రక నేపథ్యం, సందేశాత్మక, ఆపాత మధురాలను ప్రదర్శించేందుకు 2024 జనవరిలో అప్పటి ఎంపీ భరత్‌రామ్ చర్యలు చేపట్టారు. సుమారు రూ.6 కోట్ల వ్యయంతో ఓపెన్ ఎయిర్ థియేటర్ నిర్మాణం చేపట్టారు. శ్రీ వెంకటేశ్వర ఆనం కళా కేంద్రం సమీపంలోగల సుబ్రహ్మణ్య మైదానంలో చిత్రాలను ప్రతీ రోజు ప్రదర్శించే విధంగా ఓపెన్‌ఎయిర్ థియేటర్లో బిగ్ స్క్రీన్ ఏర్పాటుచేసి రాత్రి సమయంలో చిత్రాలను ప్రదర్శిస్తూ ఉండేవారు. 2024 జనవరిలో సంక్రాంతి కానుకగా ప్రారంభించిన చిత్రాల ప్రదర్శనను 11 నెలలకే నగరపాలక సంస్థ అధికారులు ఆపివేశారు.

సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరంలో కళలకు పెద్ద పీట వేసేందుకు, నేటి తరానికి చరిత్ర ఆనవాళ్లు తెలియజెప్పేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని నిలిపివేయడంతో సాహితీ అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆహ్లాదంగా ఆపాత మధురాలను వీక్షించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అర్ధంతరంగా నిలిపివేయడంపై నగర ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన సాహితీ కార్యక్రమాల్ని అధికారులు నిలిపివేయాలనుకున్నారో ఏమో తెలియదు గానీ నెల రోజులుగా చిత్రాలను ప్రదర్శించకపోవడంతో నిత్యం చిత్రాలను చూసేందుకు అలవాటు పడిన జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి చిత్రాల ప్రదర్శనను ఏర్పాటు చేయాలంటూ విజ్ఞప్తి చేస్తున్నారు.

స్పందించని అధికారులు

అయితే చిత్రాల ప్రదర్శన నిలిపివేయడంపై ప్రశ్నిస్తే సంబంధిత సిబ్బంది సమాధానం చెప్పకపోవడం పట్ల నగర ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కమిషనర్ దినేష్‌కుమార్ ఆధ్వర్యంలో 11 నెలల పాటు చిత్రాలను ప్రదర్శించేందుకు కాంట్రాక్టు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ కాంట్రాక్టు ఒప్పందం నవంబర్‌తో ముగిసింది. సమయం పూర్తి కావడంతో కాంట్రాక్టర్ చిత్రాల ప్రదర్శన ఆపివేశారు. దీనిపై చర్యలు చేపట్టాల్సిన నగరపాలక సంస్థ అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం పట్ల చిత్రాల ప్రదర్శన ఆగిపోయింది. ఈ విషయమై సంబంధిత నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులను వివరణ కోరగా సమాధానం చెప్పేందుకు నిరాకరించారు.

ప్రజలకు ఆనందాన్ని ఇచ్చే అంశం



సందేశాత్మక చిత్రాల ప్రదర్శన నగర ప్రజలకు ఆనందాన్ని ఇచ్చే అంశం. అర్ధంతరంగా చిత్రాల ప్రదర్శన ఆపేసి, ఏడాది పూర్తి కాకుండానే కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను నిరుపయోగంగా మార్చడం దారుణం. అధికారులు దృష్టి సారించి చిత్రాల ప్రదర్శన ఏర్పాటు చేయాలి.

– బి.రామ్‌కుమార్, రాజమహేంద్రవరం

సమంజసం కాదు



నగర ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే చిత్రాల ప్రదర్శన నిలిపేయడం సమంజసం కాదు. కోట్లాది రూపాయల వ్యయంతో ఓపెన్ ఎయిర్ థియేటర్ నిర్మాణం చేపట్టి నగర ప్రజలకు ఉచితంగా సందేశాత్మక చిత్రాలను ప్రదర్శించేందుకు ఏర్పాటు చేస్తే అర్ధంతరంగా నిలిపేయడం అధికారులకు తగదు.

– సుంకర ఈశ్వర్, రాజమహేంద్రవరం

సాబ్జీ ఆశయ సాధనకు కృషి



మాజీ ఎమ్మెల్సీ సాబ్జి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కంబాలచెరువు: రాష్ట్రంలో ఉపాధ్యాయ ఉద్యమానికి అలుపెరుగని కృషి చేసి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి నిరంతరం ప్రయత్నించిన యూటీఎఫ్ పూర్వపు రాష్ట్ర అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి ఆశయ సాధనకు మనమంతా కృషి చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.అరుణ కుమారి అన్నారు. సాబ్జి వర్ధంతి సభ ఆదివారం స్థానిక యూటీఎఫ్ హోమ్‌లో జరిగింది. దీనికి యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.షరీఫ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ ఉద్యమానికి సాబ్జీ చేసిన పలు కార్యక్రమాలు వివరించారు. సీపీఎస్ ఉద్యమానికి జవసత్వాలు నింపి దశ దిశ ఏర్పాటు చేసిన మహా ఉద్యమ నాయకుడు సాబ్జి అన్నారు. రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి మాట్లాడుతూ ఎంతోమంది కార్యకర్తలను తయారు చేసిన ఉద్యమ నాయకుడు సాబ్జీ అన్నారు. ఆయన కలుపుగోరుతనం, దీక్షా దక్షిత, పోరాట స్ఫూర్తి యూటీఎఫ్ ఉద్యమ చరిత్రలో ఎప్పటికీ ఒక మైలురాయిగా నిలిచిపోతాయన్నారు. అనంతరం సాబ్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూటీఎఫ్ కోశాధికారి ఈవీఎస్ఆర్ ప్రసాద్, జిల్లా కార్యదర్శులు సీహెచ్ దయానిధి, చిలుకూరి శ్రీనివాసరావు, ప్రకాష్‌రావు, ఎం.శ్రీనివాసరావు, రాజమహేంద్రవరం రూరల్ కార్యదర్శి ఎ.శ్రీనివాసరావు, రాజానగరం అధ్యక్షుడు ఐడీకేడీ రాజేశ్వరి, కడియం అధ్యక్షుడు వి.శాస్త్రి, అనిల్, రామరాజు, పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత ఎస్‌ఎస్ కింగ్స్



విజేత జట్టుకు ట్రోఫీలను అందజేస్తున్న బొప్పన సుబ్బారావు, చీరారాజు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: ఆర్‌జీపీబీసీ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్–4 విజేతగా ఎస్ఎస్ కింగ్స్ నిలిచిందని ఆర్గనైజర్ వజ్రపు నాగభూషణం(బూస్ట్) తెలిపారు. హుకుంపేట గ్రౌండ్‌లో పదిరోజులుగా బూస్ట్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ సీజన్–4లో 16 జట్లు తలపడ్డాయి. ఈ టోర్నీలో ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో మోరంపూడి యూత్, ఎస్ఎస్ కింగ్స్ జట్లు తలపడ్డాయి. పోటీలో ఎస్ఎస్ కింగ్స్ విజేతగా నిలిచింది. జట్ల సభ్యులు కె.రవి, శివాజీ, పండు, మహేష్, చారి అజయ్ తదితరులకు విన్నర్స్ ప్రైజ్‌మనీ, ట్రోఫీని సొసైటీ మాజీ అధ్యక్షుడు బొప్పన సుబ్బారావు, చీరారాజు, బండి నాగేశ్వరరావు, సూర్యప్రకాష్ చేతులమీదుగా అందజేశారు. క్రికెట్ టోర్నమెంట్‌ల నిర్వహణ ద్వారా క్రీడాకారులలో స్నేహభావం ఏర్పడుతుందని ముఖ్య అతిథులు పేర్కొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో డాన్స్ చేస్తున్న పిల్లలు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): అల్కాట్‌తోటలోని ది గ్రేస్ ఇవాలెంజికల్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో గ్రేస్‌హోమ్‌లో ఆదివారం రాత్రి వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రదర్ ఈ.షడ్రక్ ప్రార్థనతో క్రిస్మస్ వేడుకలను ప్రారంభించారు. సండే స్కూల్ చిల్డ్రన్స్ పాటలు, స్కిట్‌లు ప్రదర్శించారు. యూత్ బృందగానం చేయగా, స్త్రీలు ప్రభువుని స్మరిస్తూ ప్రత్యేక పాటలు పాడారు. క్రీస్తు జననమును పురస్కరించుకుని ప్రత్యేక నాటికను ప్రదర్శించారు. వ్యవస్థాపక అధ్యక్షుడు ఈ.షడ్రక్ క్రిస్మస్ సందేశములో ఏసుక్రీస్తు సర్వమానవాళి రక్షణార్థమై కన్యమరియ గర్భం ద్వారా ఉద్భవించెనని పేర్కొన్నారు. అనంతరం ప్రేమవిందు ఏర్పాటు చేశారు. ఉభయగోదావరిజిల్లాల నుంచి విశ్వాసులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఇన్నేళ్లకు మళ్లీ...



34 ఏళ్ల తరువాత కలుసుకున్న ధవళేశ్వరం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు

ధవళేశ్వరం: 34 ఏళ్లక్రితం తాము చేసిన అల్లరి, ఆటపాటలు వారి కళ్ల ముందు మళ్లీ కదలాడాయి. ఐదు పదుల వయసుకు దగ్గరకు వస్తున్న వారంతా చిన్నపిల్లలైపోయారు. ఆటపాటలతో కేరింతలు కొట్టారు. ఈ సంఘటనలకు వేదికగా మారింది ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల 1989–90 పూర్వ విద్యార్థుల సమ్మేళనం. ఆదివారం ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1989–90 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు, పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ద్వారా కలుసుకున్నారు. 34 ఏళ్ల క్రితం తాము చదివిన పాఠశాలను చూసి అలనాడు తాము చేసిన అల్లరి, ఆటపాటలను గుర్తుకు తెచ్చుకొని స్నేహితులతో సంతోషంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులు కృష్ణమూర్తి, సుబ్బారావు,నిలకంఠ, సంపత లక్ష్మీ,సత్యవతి, రాజరాజేశ్వరి,హైమావతి,సతీమణి తదితరులను ఘనంగా సన్మానించారు. ఈ విద్యార్థుల సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు గుర్రాల వెంకట్రావు, విప్పర్తి ఫణి కుమార్,మట్టా నరసింహారాజు, తాడి రామిరెడ్డి, బోడ గంగాధర్, యర్ల రాజా రమేష్, తుమ్మా రాంబాబు, మహమ్మద్ మౌలానా, ఆకుల బాబు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయం



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేసీ చిన్న రాముడు తదితరులు



కాతేరులో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాస్

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయమని జేసీ చిన్న రాముడు కొనియాడారు. ఆదివారం కలెక్టరేట్‌లో పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు మాట్లాడుతూ తెలుగు భాష మాట్లాడే వారి కోసం ప్రత్యేక రాష్ట్రం కావాలని ఆమరణ దీక్ష చేపట్టి, రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన గొప్పవ్యక్తి అన్నారు. తదుపరి రోజుల్లో నెల్లూరు జిల్లాకు ఆయన పేరు పెట్టారని తెలిపారు. లక్ష్య సాధనలో ప్రాణాలు అర్పించిన అటువంటి నాయకుల నుంచి స్ఫూర్తి పొందాలని జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు పిలుపు ఇచ్చారు. భారతదేశంలో తొలిసారిగా భాషా ప్రయుక్త రాష్ట్రం కావాలని పోరాడిన యోధుడు పొట్టి శ్రీరాములు వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీవో ఎల్.అప్పలకొండ, ఇన్‌చార్జి జిల్లా బీసీ సంక్షేమ అధికారి కేఎన్ జ్యోతి, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ టి.రాధిక, కలక్టరేట్ ఏవో ఆలీ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాతేరులో...

రాజమహేంద్రవరం రూరల్: కాతేరులోని వ్యవసాయ కళాశాలలో ఆదివారం అమరజీవి పొట్టిశ్రీరాములు వర్ధంతి అసోసియేట్ డీన్ డాక్టర్ డి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పొట్టిశ్రీరాములు చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగాన్ని కొనియాడారు. గాంధేయవాది అయిన శ్రీ పొట్టి శ్రీరాములు ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొన్నారని తెలిపారు. తెలుగు వారికి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కావాలని 56 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణాలు అర్పించిన మహనీయుడు అని, ప్రతి ఏడాది ఆయన వర్ధంతిని ఆత్మార్పణ దినంగా జరుపుకుని స్మరించుకోవాల్సిన అవసరం ఉందని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. వ్యవసాయ కళాశాల అధ్యాపకులు డాక్టర్ ప్రవీణ, డాక్టర్ శేఖర్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సంతోష్, డాక్టర్ చిన్ని, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కడియంలో..

కడియం: అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయమని రూరల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తాడాల కొండ్రాజు అన్నారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని శ్రీరాములు విగ్రహానికి ఆయన పుష్పాంజలి ఘటించారు. ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజు, వీరభద్రరావు, సత్తిబాబు, వెంకట్రావు, వెంకటేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

కళావైభవం పునరుద్ధరిస్తా



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్



సంగీత విభావరిలో పాటలు పాడుతున్న గాయకులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం కళావైభవాన్ని పునరుద్ధరించేందుకు కృషిచేస్తానని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక ఆనం కళాకేంద్రంలో సింగర్స్ ఫ్రెండ్స్ సొసైటీ (ఎస్ఎఫ్ఎస్) ఏడవ వార్షికోత్సవం సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు ఆదిమూలం సాయిబాబా, ఎంవి.అయ్యన్న ఆధ్వర్యంలో ఇంద్రధనుస్సు పేరుతో నిర్వహించిన సినీ మ్యూజికల్ నైట్ ఆహుతులను అలరించింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కందుల దుర్గేష్ మాట్లాడుతూ ప్రతి వారం ఆనం కళాకేంద్రంలో కళాసాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేలా కృషిచేయాలని సూచించారు. గాయకులు షేక్ నజీరుద్దీన్, శ్రీకీర్తి, గారపాటి సుధీర్‌తో పాటు ఎస్ఎఫ్ఎస్ సభ్యులు ఆలపించిన గీతాలు అందరిని కట్టిపడేశాయి. సినీనటుడు జిత్‌మోహన్‌మిత్ర, ఎల్ఐసీ డివిజనల్ సీనియర్ మేనేజర్ సంధ్యారాణి మాట్లాడారు. ఎల్ఐసీ రూరల్ బ్రాంచి మేనేజర్ సూర్యనారాయణ, మాజీ కార్పొరేటర్ గాయకుడు ఏవీ రమణ, సాయిబాబాను గజమాలతో సత్కరించారు.

ఉల్లాసంగా..... ఉత్సాహంగా...

- చిన్ననాటి స్నేహితుల ఆత్మీయ కలయక
- మిత్రుడికి రూ.40 ఆర్థిక సాయం అందజేత



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పూర్వపు విద్యార్థులు

సీటీఆర్ఐ: వారంతా బాల్యంలో చేసిన అల్లరి గుర్తుకు తెచ్చుకున్నారు. అంతే వారంతా ఒక్కసారిగా చిన్నపిల్లలు అయిపోయారు. గేమ్స్, అంత్యక్షారితో ఉల్లాసంగా గడిపారు. కొందరు హైదరాబాద్, బెంగళూర్, కర్నాటక, విజయవాడ, వైజాగ్ వంటి ప్రాంతాల నుంచి వచ్చి కలుసుకున్నారు. వివరాలలోకి వెళితే.... స్థానిక మున్సిపల్ కాలనీలో బీఇఎం(భారత్ ఈవాంజికల్ మిషనరీ) హైస్కూల్‌లో దాదాపు 30 ఏళ్ల క్రితం పదవ తరగతి వరకు కలిసి చదువుకున్నారు. కాని పదవ తరగతి అయిపోయిన తరువాత ఇంటర్మీయేట్, డిగ్రీ, పిజీ చదువుల కోసం వేర్వేరు చోట్లకి మారారు. అప్పటి నుంచి వారి మధ్య ఎటువంటి కాంటాక్ట్స్ లేవు. వారిలో కొంతమంది పోలీసులు, కొందరు లాయర్లు, ఆర్మీ ,బిజినెస్ మేన్, బిజినెస్ వుమెన్‌గా వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. నెల రోజల క్రితం ఒకరిద్దరు కలుసుకొని చిన్ననాటి ముచ్చట్లు చెప్పుకున్నారు. అంతే వారిలో అందరూ కలవాలనే ఆలోచన వచ్చింది. వచ్చిందే తడువుగా ఒక వాట్సప్ గ్రూప్ క్రియేట్ చేశారు. ఒకరి ద్వారా ఒకరు ఇలా 70 మంది వరకు వాట్సప్ గ్రూప్‌లోకి అందుబాటులోకి వచ్చారు. అందరం ఆదివారం కలవాలనుకొని ప్లాన్ చేసుకున్నారు. బూరుగుపూడి దగ్గర ఉన్న బేబిరావు గార్డెన్స్‌లో ఆదివారం ఆత్మీయ కలియక ఏర్పాటు చేసుకున్నారు. ఒకరిని ఒకరు పొల్చుకుంటూ ఏం చేస్తున్నారు అంటూ కుశల ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. కొందరు గుర్తు పట్టలేనంతగా మారిపోవడంతో తన పేరు చెప్పి పరిచయం చేసుకుంటేనే కాని పోల్చుకోలేక పోయారు. నాడు స్కూల్‌లో చేసిన అల్లరి గుర్తుకు తెచ్చుకుని ఆనందంగా గడిపారు. గేమ్స్, అంత్యక్షారి వంటి ఆటపాటలతో రిఫ్రెష్ అయ్యారు. తోటి మిత్రునికి యాక్సిడెంట్ అయ్యిందని తెలుసుకుని అందరూ కలిసి రూ.40 వేల సాయం అందజేశారు. సాయంత్రం అందరూ విడిపోయి ఎవరి ఇంటికి వారు బయలుదేరేటప్పుడు భావోద్వేగాలకు గురయ్యారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



ఉపాధ్యాయులతో తోలత్ మెమోరియల్ ఉన్నత పాఠశాల 1998-99 బ్యాచ్ విద్యార్థులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరంలోని తోలత్ మెమోరియల్ ఉన్నత పాఠశాల 1998–99 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం స్థానిక ఏవీఏ రోడ్డులోని పార్టీలాండ్ సమావేశహాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పదవ తరగతి చదివి 25ఏళ్లు పూర్తయిన సందర్భంగా పూర్వ విద్యార్థులు 50మంది కలిసి అలనాటి తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. నిక్‌నేమ్‌లతో ఒకరిని ఒకరు అప్యాయంగా పలకరించుకుంటూ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తమకు విద్యను నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. గణిత ఉపాధ్యాయులు డి.రాముడు, సైన్స్ ఉపాధ్యాయులు జోసఫ్‌రాజు, పద్మ, శైలజ, ఇంగ్లిషు టీచర్ కృపామణి, హిందీ టీచర్ దుర్గాదేవి, సోషల్ టీచర్ అనంతలక్ష్మి, హేమ, కుమార్‌లను ఘనంగా సత్కరించారు. గురువుల ఆశీస్సులతో తాము జీవితంలో అత్యున్నత స్థాయిలో స్థిరపడ్డామని చదువుకున్నరోజుల్లో వారు నేర్పిన క్రమశిక్షణ నేటికీ ఎంతో ప్రయోజనకరంగా ఉందని పూర్వ విద్యార్థులు తెలిపారు. విద్యార్థులు సైంటిస్ట్ మూర్తి, సాంబశివరావు, రిషి, హుస్సేన్, జ్యోతి, బిందు, గంగాభవాని పాల్గొన్నారు.

కోడి పుంజుల చోరీపై కేసు నమోదు

బిక్కవోలు: కోడిపుంజుల చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్ తెలిపారు. మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన కొమరపు ఆనందరావు ఇంటి వద్ద పెంచుకుంటున్న రెండు కోళ్లను ఈ నెల 14వ తేదీన గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు చోరీ చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో గ్రామంలో విచారణ చేయగా చుట్టు పక్కల గ్రామాల్లో సైతం చోరీలు జరిగినట్లు గుర్తించామన్నారు.